ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 27 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.90 (308.7614)	28,253	46,229
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.29)	4,852.39	4,640.97
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	42,689	36,957

చికెన్ ధరలు | లైవ్ : రూ.138 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.228

సాగునీటి వనరుల పెంపునకు సన్నాహాలు

- తక్కువ వ్యయంతో చిన్న నీటివనరుల పూర్తికి ప్రభుత్వం ఆలోచన
- ప్రభుత్వ హామీతో ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యేల సమాలోచనలు
- మూసీ పరివాహక ప్రాంతంలో చిన్నకాల్వల ఆధునికీకరణ
- అలీనగర్, బొల్లెపల్లి, భీమలింగం కత్వలపై దృష్టి
- బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ


బునాదిగాని కాల్వ

చిన్ననీటి పథకాల కింద సాగు భూమిని పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అధిక వ్యయంతో కూడిన సాగునీటి పథకాలు కాకుండా, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెంచేందుకు స్థానిక ఎమ్మెల్యేలు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు సాగునీటి పారుదలను మెరుగుపరిచేందుకు ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమాలోచనలు చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వల సామర్థ్యం పెంపు, పునరుద్ధరణ అనంతరం ఏ మేరకు సాగునీటిని అందించవచ్చన్న అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

జిల్లాతోపాటు, నల్లగొండ జిల్లాలోని పలు మండలాలకు బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల ద్వారా సాగునీరు అందుతోంది. ఈ కాల్వల పునరుద్ధరణకు ఇరిగేషన్‌శాఖ అంచనాలు రూపొందిస్తోంది. ఈ కాల్వల పునరుద్ధరణకు సుమారు రూ.450కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా. ఈ కాల్వలను పునరుద్ధరించడంతో పాటు దీని పరిధిలోని చెరువులను నింపేందుకు ప్రస్తుతం ఉన్న చిన్నకాల్వల (డిస్ట్రిబ్యూటరీల) విస్తీర్ణాన్ని పెంచేందుకు అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. చిన్న కాల్వలను ఆధునీకరిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

మంత్రి సమీక్షతో ముందడుగు

భారీనీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల భువనగిరిలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చిన్ననీటి పారుదల కింద ప్రభుత్వం నిధులిచ్చేందుకు సిద్ధంగా ఉందని, గతంలో రూపొందించిన ప్రతిపాదనలతో సంబంధం లేకుండా తాజాగా సాగునీటి కాల్వల పునరుద్ధరణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ అంచనాలు రూపొందిస్తున్నారు. అంతేగాక, వీటికి అనుబంధంగా ఉన్న చిన్న కాల్వల విస్తీర్ణాన్ని పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా మూసీ పరిధిలోని చిన్న కాల్వలపైనా అధికారులు దృష్టిసారించి కార్యాచర రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

అలీనగర్, బొల్లెపల్లి, బీమలింగం కాల్వల వెడల్పు

మూసీ పరివాహక ప్రాంతంలోని బునాదికాల్వకు అనుసంధానంగా ఉన్న అలీనగర్, బొల్లెపల్లి, బీమలింగం కత్వ ద్వారా పలు చెరువుల్లోకి నీరు వెళ్తుంది. ఈ కాల్వల విస్తీర్ణం చిన్నదిగా ఉండటంతో పాటు కాల్వల్లో గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో మూసుకుపోయాయి. వీటిని పునరుద్ధరిస్తే చెరువుల్లోకి నీరు చేరి సాగు విస్తర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. అంతేగాక బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి ప్రధాన కాల్వల పునరుద్ధరణతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న చిన్న కాల్వల వెడల్పు చేయాలన్న ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ఈ కాల్వలకు సరైన డిజైన్ రూపొందించలేదని, ఏడు అడుగుల కాల్వకు ఒక మీటరు పైపు లైన్ వేయడంతో నీరు సరిగా రావడంలేదని ఎమ్మెల్యేలు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో చిన్న కాల్వల పునరుద్ధరణకు అవసరమయ్యే నిధులకు అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. గతంలో రూపొందించిన అంచనాల ప్రకారం వీటిని పునరుద్ధరిస్తే జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాల్లోని ఏడు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అలీనగర్, బొల్లెపల్లి, బీమలింగం కత్వల వెడల్పు చేస్తే మూసీ పరివాహక ప్రాంతంలోని ఒక్క భువనగిరి నియోజకవర్గంలో 15వేల ఎకరాల వరకు అదనంగా సాగు నీరు అందుతుంది. ఒక్కో కాల్వ ఆధునీకీకరణకు రూ.10కోట్లు, మూడు కాల్వలకు మొత్తంగా రూ.30కోట్ల మేరకు వ్యయం కానున్నట్లు అంచనా. కాల్వ 51 కిలోమీటర్ల పొడవు ఉండగా, దీనిపై 102 కల్వర్టులు నిర్మించాలి. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీలు, కాల్వల ద్వారా 46 చెరువులు నిండనున్నాయి. అధికారుల ప్రతిపాదనల అనంతరం ఎమ్మెల్యేలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు సన్నద్ధమవుతున్నారు.

పునరుద్ధరణకు రైతులు సై

బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల రీడిజైన్, లైనింగ్ స్ట్రక్చర్ చేస్తే అదనంగా ఆయకట్టు సాగులోకి వస్తుందని ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యేలతోపాటు రైతులు విజ్ఞప్తి చేశారు. కాల్వల వెడల్పు 15 అడుగులకు పెంచేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించడం ప్రభుత్వానికి సవాల్‌గా ఉండనుంది. స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి భూసేకరణ చేసిన పక్షంలో, ఎన్ని నిధులైన ఇస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో చర్చించగా భూములిచ్చేందుకు సహకరిస్తామని ముందుకు వచ్చినట్టు తెలిసింది. బునాదిగాని కాల్వకు గతంలో 200ఎకరాల వరకు భూసేకరణ అధికారులు సిద్ధం కాగా, కాల్వలను వెడల్పు చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో సుమారు 350ఎకరాలకు పైగా సేకరించనున్నారు. ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలకు 250 ఎకరాల చొప్పున భూసేకరణ చేసే అవకాశం ఉంది. ఆ తరువాతే పునరుద్ధరణ పనులు సాగనున్నాయి.



సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు సన్నాహాలు

భువనగిరి నియోజకవర్గంలోని బునాదిగాని కాల్వకు అనుసంధానంగా ఉన్న అలీనగర్, బీమలింగం కత్వ, బొల్లేపల్లి కాల్వలను ఆధునీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. బునాదిగాని కాల్వకు అనుసంధానంగా ఉన్న చిన్న కాల్వల వెడల్పుతో పాటు, ఓపెన్ కల్వర్టులు నిర్మించాలి. తద్వారా చెరువుల్లోకి నీరు చేరుతుంది. ఈ మేరకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించిన పక్షంలో అదనంగా 15వేల సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

● కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం : కలెక్టర్


ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 26: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి అయిలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో చాకలి అయిలమ్మ జయంతి సందర్భంగా గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తికోసం అలుపెరగని పోరాటంచేసిన వీరనారి అని కీర్తించారు. ఆమె ఆశయాలు సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, జడ్పీ సీఈవో శోభరాణి, డీఆర్డీవో టి.నాగిరెడ్డి, బీసీ కులాల అభివృద్ధి అధికారి పి.యాదయ్య, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం రోడ్డు భద్రతా కమిటీ సమీక్షలో ఆయన మాట్లాడారు. రోడ్లపై ప్రమాదాల తగ్గింపునకు అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడటం, ప్రమాదాలు అధికంగా జరిగే ముఖ్యప్రాంతాల్లో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద వేగ నియంత్రికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ ఈఈ వి.బాలప్రసాద్, ఏసీపీ ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఎంవీఐ ఇమ్రాన్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1న వయోవృద్ధుల వారోత్సవాల్లో వృద్ధుల రక్షణ, వారి హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ అధికారి కే.నరసింహారావు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు బాలేశ్వర్, చంద్రశేఖర్, సోమన్న, రమేష్, జ్ఞానేశ్వర్, భిక్షపతి, సీడీపీవోలు శైలజ, జ్యోత్స్న, స్వరాజ్యం, రమ, సమీరా, మీర్జా, సిబ్బంది పాల్గొన్నారు.

బీబీనగర్ చెరువును అభివృద్ధి చేస్తాం

● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


బీబీనగర్ చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, సెప్టెంబరు 26: బీబీనగర్ పెద్దచెరువును సుందరీకరించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఇరిగేషన్, పర్యాటక శాఖ అధికారులతో కలిసి ఆయన బీబీనగర్ చెరువును పరిశీలించారు. అనంతరం రాఘవాపురం వద్ద బునాదిగాని కాల్వ, సీనతండా వద్ద బొల్లేపల్లి మూసీ కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చేరువలో వరంగల్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బీబీనగర్ పెద్ద చెరువు కట్టను పటిష్ఠం చేయడంతోపాటు పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం సంబంధిత టూరిజం, ఇరిగేషన్ అధికారులతో సుందరీకరణ పనులపై సమీక్షించనున్నట్లు తెలిపారు. అలాగే బునాదిగాని, పిలాయిపల్లి, బొల్లేపల్లి మూసీ కాల్వల విస్తరణ చేపట్టేందుకు అవసరమైన నిధుల మంజూరుకోసం ఇప్పటికే నివేదిక తయారుచేసి సంబంధిత మంత్రిని కలిసి నివేదించామన్నారు. బునాదిగాని కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి రైతులకు సజావుగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతకుముందు మండలంలోని గూడూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, గోళి పింగల్ రెడ్డి, పొట్టోళ్ల శ్యాంగౌడ్, గోళి నరేందర్‌రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, ఆగమయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఖిల్లా అభివృద్ధికి సహకరించాలి

● రైతులకు న్యాయం చేస్తాం ● పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26: భువనగిరి ఖిల్లా అభివృద్ధికి రైతులు సహకరించాలని పర్యాటక శాఖ ఎండి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనుల కోసం సేకరిస్తున్న ప్రైవేట్ భూముల రైతులతో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనే రోప్‌వే బేస్ క్యాంప్ కోసం సుమారు 3 ఎకరాల ప్రైవేట్ స్థలాన్ని సేకరించి అప్పట్లోనే నష్ట పరిహారం అందించామన్నారు. తాజాగా రోప్‌వే తీగల మార్గం కింది భాగంలో గల భూములను సేకరిస్తున్నట్లు, ఈ మేరకు నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు పలు ప్రతిపాదనలను అధికారులు, రైతులు పరిశీలించారు. మరోమారు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకుంటామని ఎండి తెలిపారు. సమావేశంలో పర్యాటక శాఖ మేనేజర్ ఎం ఉపేందర్‌రెడ్డి, తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ జీవితం.. తెరిచిన పుస్తకం

● చేనేత వర్గాల్లో ఆత్మగౌరవ నినాదాన్ని చాటిన త్యాగశీలి
● నేడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి


ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ(ఫైల్)

నిజాం నిరంకుశత్వాన్ని ధిక్కరించిన పోరాట యోధుడు.. భారత జాతీయ కాంగ్రెస్‌కు నిఖార్సయిన కార్యకర్త.. కొండా లక్ష్మణ్‌బాపూజీ నేటి రాజకీయ నేతలకు స్ఫూర్తి ప్రదాత. హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రథమ సత్యాగ్రహి అయిన ఆయన ఆదర్శానికి నిదర్శనంగా, ఆయన అంతిమ దశలో ఉన్నప్పుడే భూదాన్‌పోచంపల్లిలో బాపూజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

● భూదాన్‌పోచంపల్లి

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం తెరచిన పుస్తకం. భారత రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడదగిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. జాతీయోద్యమ స్ఫూర్తితో రాజకీయాల్లో ప్రవేశించిన కొండా లక్ష్మణ్ బాపూజీ స్వేచ్ఛా స్వాతంత్ర్యం, సమానత్వం, న్యాయం కోసం నిరంతరం శ్రమించేవారు. దేశ స్వాతంత్ర్యానంతరం అమల్లోకి వచ్చిన రాజ్యాంగ స్ఫూర్తితో అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం న్యాయవాదిగా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారు.

పోచంపల్లితో.. బాపూజీ అనుబంధం

స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి, జైలుకు వెళ్లారు. పద్మశాలీయుల కుటుంబాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన లక్ష్మణ్‌బాపూజీకి భూదాన్‌పోచంపల్లితో విడదీయరాని అనుబంధం ఉంది. పోచంపల్లిలో చేనేత కుటుంబాల కోసం ఓ కాలనీని (లక్ష్మణ్‌నగర్) ఏర్పాటుచేసి 100 ఇళ్లు కట్టించిన ఘనత ఆయనకే దక్కింది.

నేడు జయంతి వేడుకలు

లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలు నేడు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10.45గంటలకు నిర్వహించే వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

చేనేత సంఘాల ఏర్పాటుకు కృషి

భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కార్మికులు కొయ్యలగూడెం చేనేత సహకార సంఘంలో సభ్యులుగా ఉండేవారు. ఆ సంఘం నుంచి పోచంపల్లికి స్వయం ప్రతిపత్తిగల సంఘంగా ఏర్పాటు చేయాలని 1955లో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. 1954లో హైదరాబాద్ కేంద్ర చేనేత సహకార సంఘం దృష్టి పోచంపల్లి కార్మికులపై పడేలా బాపూజీ చేశారు. నిలువు, పేకతో వినూత్న డిజైన్‌లతో రూపొందిస్తున్న వస్త్రాలను చూసి భూదాన్‌పోచంపల్లిలో 1955లో స్వయం ప్రతిపత్తిగల చేనేత సహకార సంఘం ఏర్పాటుకు ఆయన కృషి శ్లాఘనీయం.

బతికుండగానే విగ్రహం ఏర్పాటు

లక్ష్మణ్ బాపూజీపై చేనేత కుటుంబాలకు ఉన్న అభిమానంతో భూదాన్‌పోచంపల్లిలోని చేనేత సహకార సంఘం ఆవరణలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. 2012 సెప్టెంబర్ 27న ఆయన జన్మదినోత్సవం రోజున ఆయనను పిలిపించాలని చేనేత నాయకులు సన్నాహాలు చేస్తుండగానే సెప్టెంబరు 21న మృతి చెందడం చేనేత వర్గాల్లో విషాదాన్ని నింపింది. ఆ విగ్రహాన్ని బాపూజీ చూసుకోకుండానే మృతి చెందారు.

రాజకీయ ప్రస్థానం



- 1952లో ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక.
- 1957లో నల్లగొండ జిల్లా చిన్నకొండూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక.
- 1960లో జిల్లా నుంచి మెదటి కేబినెట్ మంత్రిగా చరిత్రకెక్కారు.
- 1965లో చిన్నకొండూరు నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నిక.
- 1969లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 1972లో భువనగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైనారు.

ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు


చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ బాపూజీ విగ్రహం

చౌటుప్పల్ టౌన్: కొండా లక్ష్మణ్ బాపూజీకి రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవాన్ని కల్పించింది. హైదరాబాద్‌లో చేనేత కార్మికుల శిక్షణకోసం ఏర్పాటుచేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)కి కాంగ్రెస్ ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి గౌరవించింది. అదేవిధంగా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఉద్యాన విశ్వ విద్యాలయానికి కూడ బాపూజీ పేరు పెట్టారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కొండా లక్ష్మణ్ బాపూజీకి చివరి వరకు అనుబంధం కొనసాగింది. దేశ స్వాతంత్ర్యోద్యమంతోపాటు నిజాంకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. తొలినాళ్లలో సమైక్యవాదిగా ఉన్న బాపూజీ 1956లో విశాలాంధ్రకు మద్దతు ప్రకటించారు. తర్వాత ఆయన అభిప్రాయాలను మార్చుకొని 1969లో ప్రజ్వరిల్లిన తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఒత్తిడిమేరకు మంత్రి పదవికి సైతం రాజీనామా చేశారు. తాను పుట్టి పెరిగిన ఆదిలాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఎనలేని సేవలను అందించారు. ప్రధానంగా చేనేత కార్మికుల సంక్షేమం-అభివృద్ధికోసం తీవ్రంగా కృషి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మొట్ట మొదటి డిప్యూటీ స్పీకర్ పదవితోపాటు రాష్ట్ర మంత్రిగా చేపట్టారు. ఆదిలాబాద్ జల్లాలోని ఆసిఫాబాద్ తోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చిన్నకొండూర్(నేటి మునుగోడు), భువనగిరి నియోజకవర్గాల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా, మూడుసార్లు ఓడిపోయారు.

కొమరంభీం జిల్లానుంచి నల్లగొండ వరకు..

కొమరంబీం జిల్లాలో జన్మించిన లక్ష్మణ్ బాపూజీకి మూడేళ్ల వయస్సు ఉన్నప్పుడే తన తల్లి మృతి చెందారు. ప్రాథమిక విద్యాభ్యాసం ఆసిఫాబాద్‌లో, న్యాయశాస్త్ర విద్యను హైదరాబాద్‌లో పూర్తి చేశారు. 1940లో హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని చేపట్టి.. అనంతర కాలంలో రాజకీయ నేతగా.. మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు.

చౌటుప్పల్‌లో విగ్రహం ఏర్పాటు

చౌటుప్పల్ పట్టణంలో లక్ష్మణ్ బాపూజీ స్మారక సేవా ట్రస్ట్ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య ఆధ్వర్యంలో బాపూజీ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని 2017 సెప్టెంబరు 27న ఆవిష్కరించారు. చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్క్ రోడ్డుకు కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గ్‌గా నామకరణం చేయాలన్న బాపూజీ ట్రస్ట్ కోరిక 12 సంవత్సరాలు దాటినా కూడా నెరవేరడం లేదు. అప్పటి సర్పంచ్ ఇచ్చిన హామీ అమలు జరగలేదు. ఇప్పటి మునిసిపాలిటీ ఏ నిర్ణయాన్ని తీసుకుంటుందో వేచి చూడాలి.

సత్ప్రవర్తనను పెంపొందించుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు


జైలును పరిశీలిస్తున్న జయరాజు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26: జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు అన్నారు. గురువారం భువనగిరి సబ్ జైలును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. నేర ప్రవృత్తిని వీడాలని, జైలును వీడాక కుటుంబంతో కలిసి గౌరవంగా జీవించేందుకు నచ్చిన, వచ్చిన పనిని నిజాయితీగా చేసుకోవాలన్నారు. ఈ నెల 28న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు చిత్తశుద్ధి చూపాలన్నారు. రాజీ పడదగిన కేసులన్నింటినీ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి వి.మాధవిలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి బి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, జైలు సూపరింటెండెంట్ నెహ్రూ పాల్గొన్నారు.

బధిరుల హక్కులను కాపాడాలి

బధిరుల హక్కులు, ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత అన్నారు. భువనగిరిలో నిర్వహించిన ప్రపంచ బధిరుల దినోత్సవంతోపాటు పలు వేర్వేరు కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. వైకల్యం చదువుకు, అభివృద్ధికి ఆటంకం కాదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి హరినాథ్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్‌ఛైర్మన్ దిడ్డి బాలాజీ, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, అనిల్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించరూ..

● అదనపు కలెక్టర్ కాళ్లపై పడిన రైతు


అదనపు కలెక్టర్ కాళ్లమీద పడుతున్న రైతు

గుండాల, సెప్టెంబరు 26: ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఏడాదిగా అడుగుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఓ రైతు అదనపు కలెక్టర్ కాళ్లపై పడి ఆవేదన వ్యక్తంచేశాడు. గురువారం గుండాల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈ సంఘటన జరిగింది. మండల కేంద్రానికి చెందిన రైతు గోపాల్‌దాసు అయిలయ్య పొలానికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ అయి మోటర్లు కాలిపోతుండటంతో ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏడాది క్రితం డీడీ కట్టాడు. గురువారం సాధారణ తనిఖీల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ కాళ్లపై పడి తన సమస్యను వివరించాడు. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

'ధరణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : బెన్‌షాలోమ్

తుర్కపల్లి, సెప్టెంబరు 26: ధరణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బెన్‌షాలోమ్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అదనపు ఆర్డీవో అమరేందర్‌తో కలిసి ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, సవరణపై తహసీల్దార్ దేశ్యానాయక్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి లక్ష్యం ఏర్పర్చుకుని ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను వారంలోనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 153 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ధరణి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జాంగీర్, రెవెన్యూ, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిండా మునిగిన రైతులు

● ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, మిర్చి పంటలకు నష్టం ● మేళ్లచెర్వు మండలంలో 17 వేల ఎకరాల్లో సాగు



ఎండిపోయిన పత్తి చేను

మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నల్ల రేగడి నేలల్లో సాగు చేసిన పత్తి, మిర్చి రైతులు నష్టపోయారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలవ్యాప్తంగా 15వేల ఎకరాల్లో పత్తి, రెండు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మొత్తం నల్లరేగడి భూమి కావడంతో వర్షాలకు అధిక మొత్తంలో నీరు నిలిచి భూమిలోకి ఇంకిపోవడంతో పాటుగా వర్షపు నీరు పొలాల్లో నిల్వ ఉండటంతో మిట్టపంట అయిన పత్తి పంట నీరు నిలిచి ఉన్న చోట పండుబారి ఎండిపోగా తేమ ఉన్న పొలాలో పూత, పిందె రాలి వట్టి ఆకులు, కొమ్మలు మాత్రమే మిగిలాయి. సాధారణంగా పత్తిపంట రసం పీల్చే పురుగుల భారీ నుంచి కాపాడుకునేందుకు బీ టీ రకం పత్తి విత్తనాలను విత్తుతారు. కాగా పత్తి మొక్కపై బీటీ ప్రభావం వంద నుంచి 120రోజులు వరకు ఉంటుంది. పత్తి మొక్క విత్తిన 45రోజుల్లో గూడ, పూత, పిందె, దశకు చేరుకొని వంద రోజుల్లో దాదాపు 80శాతం పంట రావాల్సి ఉండడం సాధారణంగా జరిగే ప్రక్రియ. కాగా ఈ సీజన్లో సకాలంలో వర్షాలు కురవడంతో జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు నాటడంతో సెప్టెంబరు చివరి వారానికి పత్తి విత్తి వంద రోజులు పూర్తి అయింది. దీంతో పత్తిలో కీటకాలను ఎదుర్కొని బీటీ శక్తి నశించిపోయింది. కాగా ప్రస్తుత పరిస్థితిలో పూర్తిగా కాసి వుండాల్సిన చేన్లు అధిక వర్షాలకు పూత, కాయలు రాలి వట్టి చెట్లుగా నిలిచాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో నష్టం జరిగింది. అధికారులు మాత్రం నామామాత్రపు తనిఖీలు నిర్వహించి మండలవ్యాప్తంగా కేవలం 170 ఎకరాలు మాత్రమే నష్టపోయిందని పూర్తిగా ఎండిపోయిన పంట పొలాలో కొన్నింటిని మాత్రమే ఎంపిక చేయడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతు న్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

ఎదగని మిర్చి పంట

మండల వ్యాప్తంగా ఇటీవల కురిసన వర్షాలకు మిర్చి పంట ఎదుగుదల లేకుండా పోయింది. సెప్టెంబరు చివరి వారంలో పూర్తిగా ఎదిగి పూత దశలో ఉండాల్సిన మిర్చి నాటిన రోజు ఉన్నట్లుగానే ఒక్క పుల్లతోనే జీవచ్ఛవంలో ఉంది. వేలకు వేలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్లు, పురుగుల ఉధృతికి గతంతో పోల్చితే పంట విస్తీర్ణం మండల వ్యాప్తంగా తగ్గిపోగా అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మిర్చి ఎదిగే పూత, పిందె వచ్చే సమయానికి నల్లి, ముడత, పేనుబంక తెగుళ్ల వచ్చి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, జనవరికి ముందుగానే పంట వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

పూత, కాయలు రాలిపోయాయి

గత సంవత్సరం కాలం కానప్పుడే రైతుల పరిస్థితి బాగుండేది. ఆరు ఎకరాల పత్తి మూడు ఎకరాల మిర్చి వేశా. పత్తి ఎకరానికి రూ.35 వేలు, మిర్చి ఎకరానికి రూ.50 వేలు, సెప్టెంబరు మొదటి వారానికి ముందే పెట్టా. కౌలు కాక రూ.3 లక్షల 50 వేల పెట్టుబడి అప్పు తెచ్చి పెట్టా. ఇప్పుడు పత్తిచెట్లు పూర్తిగా పూతలు, కాయలు రాలిపోయాయి మిర్చి ఎండిపోయే దశలో ఉందని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిశీలనకు రాలేదు.

● పత్తి రైతు సుంకరి హనుమంతు, మేళ్లచెర్వు.

నిండామునిగిపోయాం

అప్పు తెచ్చి కౌలుకు నాలుగు ఎకరాలు పత్తి వేశామని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లిందని వట్టి చెట్లే మిగిలాయి. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో అట్టి పత్తి చేళ్లకు మళ్లీ మొదట నుంచి మందులు వాడిన ప్రయోజనం ఉండదని ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం సరైన సలహాలు, సూచనలు చేసి అయినా రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేయాలి.

● అప్పిరెడ్డి, రైతు


శాస్త్రోక్తంగా నిత్య పూజలు



అలంకారమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాల నైరుతి దిశలో ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు అభర ణాలు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపం లో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహిం చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాల యంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహ వనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ.7,25,882ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం 588.90 అడుగులు



నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రం 588.90 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 588.90 అడుగులు (308.7614టీఎంసీలు)గా ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 28,253 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతుండగా, సాగర్ నుంచి 46,229 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో..

ఎగువ మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఐదారు రోజులుగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది. ఎగువ నుంచి పెరుగుతున్న వరద మేరకు ప్రాజెక్టు 2, 3, 7 నెంబర్ క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి దిగువ మూసీకి వదులుతున్న ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు గురువారం 8వ నెంబర్ క్రస్టు గేటును అడుగు మేర ఎత్తారు. ఎగువ ప్రాంతాల నుంచి 4,852.39 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా నాలుగు క్రస్టుగేట్ల ద్వారా 4,326.24 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ద్వారా ఆయకట్టుకు 314.73 క్యూసెక్కులు మొత్తం 4,640.97 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644అడుగులు (4.20టీఎంసీ)లుగా ఉంది. కాగా రెండో విడతగా కుడికాల్వకు 48.42 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 266.31 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'పులిచింతల'కు నిలకడగా వరద

పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 175అడుగులు (45.77టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 174.89అడుగులు (45.61 టీఎంసీలు)గా నమోదైంది. ఐదు రోజులుగా ఒక గేటు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 42,689 క్యూసెక్కులు వరద ప్రవాహం కొనసాగుతుండగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటును 2.5 మీటర్లు ఎత్తి 20,957 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 108 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

క్లిక్ క్లిక్




సాగర్ ఎడమకాల్వపై వేములపల్లి ఊర చెరువు సమీపంలో రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

సాగర్ ఎడమకాల్వపై నిర్మాణ సమయంలో నిర్మించిన వంతెనలు దశాబ్ధ కాలంగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రపంచబ్యాంకు నిధులతో సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టినప్పటికీ కాల్వల లైనింగ్ పనులు చేసిన అధికారులు వాటిపై ఏర్పాటు చేసిన వంతెనలను మరమ్మతులు చేయలేదు. శిథిలమై ప్రమాదకరంగా మారడంతో ప్రజలు భయాందోళనల మధ్య వాటిపై రాకపోకలు సాగిస్తున్నారు. సాగర్ ఎడమకాల్వ నిర్మాణ సమయంలో నల్లగొండ జిల్లా వేములపల్లి ఎల్-13, ఊరచెరువు సమీపంలో, అదేవిధంగా రావులపెంట శివారులోని పాలేరువాగు, మూసీల వద్ద ఊటీలపై తదితర ప్రాంతాలపై ఎడమవైపు బ్రిడ్జీలు నిర్మించారు. వంతెనల రైలింగ్‌లు దెబ్బతినడంతో పాటు రక్షణ దిమ్మెలు సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిపై నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం పొంచి ఉందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన ద్వారా రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినా కాల్వలో పడిపోయే ప్రమా దముంది. ఈ ఇరుకైన వంతెనలను ఆధునికీకరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పరిసర రైతులు, వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో కాల్వకట్టలు బురదమయంగా మారడంతో వంతెనలు ఇరుకుగా ఉండడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎన్నెస్పీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేపట్టి రైలింగ్, రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● వేములపల్లి

అండర్ పాస్ నిండా నీరు.. వెళ్లలేక ఇబ్బంది



ఇనుపాముల వద్ద-65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్‌లో నిలిచిన వర్షపు నీటిలో నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనదారులు

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఇనుపాముల వద్ద నిర్మించిన పెడెస్టల్ అండర్ పాస్(పీయూపీ) వంతెన వర్షపు నీటితో నిండిపోయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చిన నీటికితోడు ఏఎమ్మార్పీ నీటితో నిండిన స్థానిక నల్లచెరువు అలుగునీరు అండర్‌పాసింగ్ వంతెన కింద చేరుతోంది. వర్షపు నీరు, చెరువు అలుగు నీరంతా అండర్ పాస్ వంతెన వద్ద గల డ్రైనేజీ నుంచి రహదారి అవతలి వైపునకు వెళ్లాలి. రహదారి నిర్మాణ సంస్థ డ్రైనేజీ నిర్మించినా నీరు వెళ్లేలా చేయకపోవడంతో నీరంతా అండర్ పాస్ వంతెన కింద, ఇరువైపులా సర్వీసు రోడ్లపైనే నిలుస్తోంది. దీంతో ఈ అండర్‌పాస్ వంతెన కింద నుంచి నకిరేకల్ పట్టణానికి ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించాల్సిన మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి, కొర్లపహాడ్, చీకటిగూడెం గ్రామాలతో పాటు నకిరేకల్ మండలంలోని మండలాపురం, చందుపట్ల గ్రామాలకు చెందిన వారు ఇక్కడ నుంచే వెళ్తుంటారు. ఈ క్రమంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటితో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడంతో ఆ నీటిలో నుంచే వెళ్లడం కష్టతరమవుతుందని వాహనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటిని ఒకట్రెండు రోజుల్లో తొలగించేలా రోడ్డు నిర్మించిన జీఎమ్మార్ సంస్థ చర్యలు తీసుకునేది. ప్రస్తుతం టోల్ నిర్వహణ బాధ్యతలు ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● కేతేపల్లి.

ఇంటి ఆవరణలో ఆడుకుంటూ..

నీటిసంపులో పడి చిన్నారి మృతి



భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 26: తల్లి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తన సోదరితో కలిసి ఆడుకుంటున్న చిన్నారి ఇంటి ఆవరణలో ఉన్న నీటిసంపులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని రాంనగర్ కాలనీలో బీహార్ రాష్ట్రంలోని బానుదేవ్‌పూర్ బర్హరకోఠికి చెందిన అర్జున్ దాస్ కొంతకాలంగా భార్యాపిల్లలతో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. రోజు కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా గురువారం ఉదయం పనికోసం బయటకు వెళ్లాడు. ఇతని కుమారుడు కిరణ్‌కుమార్(13నెలలు) సాయంత్రం 4:30 గంటల సమయంలో ఇంట్లో తల్లి నిద్రిస్తున్న సమయంలో తన సోదరితో ఆడుకుంటూ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి పోయాడు. అదే ఇంటిలో అద్దెకుంటున్న మరో వ్యక్తి సంతోష్ తన పని ముగించుకుని ఇంటికిరావడంతో నీటి సంపులో తమ్ముడు పడిపోయాడని సోదరి చెప్పడంతో వెంటనే సంపులోకి చూడగా బాలుడు నీటిలో మునిగి చనిపోయి ఉన్నాడు. వెంటనే తల్లికి, పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతదేహంతో ఆందోళన



ఇంటి ఎదుట ఉంచిన మృతదేహం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26: అప్పు తీసుకున్న వ్యక్తి అసలుతో పాటు వడ్డీ చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో జరిగింది. భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన నిడిగొండ శివప్రసాద్(42) అనే చేనేత కార్మికుడు పట్టణంలో మిర్చి బండి కూడా నడిపిస్తాడు. మధ్య వర్తిగా ఉండి ఒకరికి అప్పు ఇప్పించాడు. అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీ చెల్లించకపోవడంతో కొంతకాలంగా సొంతంగా శివప్ర సాద్ నెలవారీ వడ్డీ చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంతో కుటుంబసభ్యులు అప్పు తీసుకున్న బంధువు ఇంటి ఎదుట గురువారం నిరసన తెలిపారు. వాగ్వాదం, రోదనలతో పరిసరాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొ న్నది. అప్పు తీసుకున్న బంధువు సకాలంలో వడ్డీ, అసలు చెల్లించకపోవడం, అదే సమయంలో అప్పు ఇచ్చిన మరో బంధువు వసూళ్ల కోసం తెచ్చిన ఒత్తిడితో మనస్తాపానికి గురై శివప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జరిగిన రాజీ అనంతరం శివశంకర్ మృతదేహాన్ని సొంతింటికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

పర్యాటక కల ఫలించేనా..?

● అన్నీ ఉన్నా పర్యాటక హబ్‌కు నోచని సూర్యాపేట జిల్లా ● శిథిలావస్థలో కాకతీయుల కళా వైభవం ● పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం



సూరాయపేట మండలం పిల్లలమర్రి గ్రామంలోని శివాలయం

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 26: సూర్యాపేట జిల్లాను టూరిజం కేంద్రంగా మారుస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందనే ఆశలో ప్రజలు ఉన్నారు. జిల్లాలో అనేక చారిత్రక కట్టడాలు, కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాలు, ప్రకృతి రమణీయతను తలపించే ఉండ్రుగొండ గుట్టలు ఉన్నాయి. నాగారం మండలం ఫణిగిరిలో బౌద్ధక్షేత్రం, అర్వపల్లి మండలంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, ఖాజా నసీరోద్దీన్ బాబాదర్గా, సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలో కాకతీయుల కాలం నాటి శివాలయాలు, చివ్వెంల మండలం ఉండ్రుగొండలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో పాటు ఉండ్రుగొండ గిరిదుర్గంలో 13పురాతన దేవాలయాలు చూడ దగ్గ ప్రదేశాలుగా ఉన్నాయి. వీటన్నింటిని కలపి ఒక టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటు చేయాలని 2021 సెప్టెంబరు 19వ తేదీన సూర్యాపేటకు విచ్చేసిన అప్పటి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ నాయకులతో పాటు ఉండ్రుగొండ దేవాలయ అభివృద్ధి కమిటి వ్యవస్థాపకుడు డాక్టర్ ఆదుర్తి రామయ్య వినతిపత్రం అందజేసి, వీడియో ప్రజంటేషన్ కూడా చూపించారు. త్వరలో కేంద్ర బృందాన్ని సూర్యాపేటకు పంపిస్తానని హామీ ఇచ్చారు. సూర్యాపేట పర్యాటక కేంద్రంగా మారుతుందన్న ఆశలు చిగురించాయి. రోజులు గడిచినా ఆ దిశగా అడుగులు పడలేదు. సూర్యాపేట జిల్లాలో నాగారం మండలం ఫణిగిరి గుట్టపైన పర్యాటకుల కోసం గెస్ట్ హౌస్, చివ్వెంల మండలం ఉండ్రుగొండలో ట్రెక్కింగ్ సౌకర్యం, రోప్‌వే, రిసార్ట్ నిర్మించాలని, ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేయాలని గత ప్రభుత్వం ఆలోచన చేసిన ఆచరణలో సాధ్యం కాలేదు. ముఖ్యంగా మూసీ ప్రాజెక్టు అనుసంధానం చేసుకొని పార్కులు ఏర్పాటు కళగానే మిగిలింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ఫణిగిరి బౌద్ధక్షేత్రం అభివృద్ధి ఎప్పుడో?

నాగారం మండలం ఫణిగిరి గ్రామ సమీపంలోని ఏకశిల కొండపై ఉన్న ఫణిగిరి బౌద్ధ క్షేత్రం ఎంతో ప్రసిద్ధమైంది. టిబెట్ దేశానికి చెందిన బౌద్ధులు ఎంతోమంది తరచూ సందర్శిస్తారు. కొండపైన 16ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధ క్షేత్రానికి చెందిన ఆరామాలు ఉన్నాయి. ఫణిగిరి బౌద్ధ సంపదకు రక్షణ లేకుండా పోతోంది. తవ్వకాల్లో బయటపడిన బుద్ధుడి విగ్రహం, శాసన పిల్లర్లు ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో మ్యూజియంగా ఏర్పాటు చేస్తే బౌద్ధులు పర్యటించే అవకాశముంది. సూర్యాపేట పట్టణానికి 65వ జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో పిల్లలమర్రి గ్రామం ఉంది. ఎంతో ప్రాశస్త్యం పొందిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం లేదు.

పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం

చారిత్రక రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా(వర్డల్ హెరిటేజ్ సైట్) యునెస్కో గుర్తించింది. కాకతీయ రాజులు అత్యంత సృజనాత్మకంగా, శిల్పకళా నైపుణ్యంతో తెలంగాణలో సృష్టించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపద దేశంలోనే ప్రత్యేక మైనది. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. అరుదైన శిల్పా కళా వైభవంతో పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్ శివాలయంలో అడుగు అడుగునా పురావస్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం శిథిలావ్యవస్థకు చేరువైంది. కంపచెట్ల మధ్యన దర్శనమిస్తోంది. భావితరాలకు ఆలయ విశిష్టతను తెలియజేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అరుదైన కాకతీయుల కళా వైభవం మరుగునపడిపోతుంది. గతంలో ఏనాడో టూరిజం హబ్ గా మార్చడం కోసం రూ. 5 కోట్ల కేటాయింపులు జరిపామని చెప్పిన అది పేపర్ల కు పరిమితం కావడంతో ఈ అద్భుత కళా సంపద మరుగున పడిపోయింది.

అసంపూర్తిగా పనులు

ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుడి వద్దకు వెళ్ళే ఘాట్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. దీనికి పురావస్తు శాఖ రూ.37 లక్షలు కేటాయించింది. రూ. 6 లక్షలతో 6 కామన్ టాయిలెట్స్ నిర్మాణం పూర్తయ్యింది. సుమారు రూ. 35 లక్షలతో నిర్మించనున్న మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో ఉంది. గుడి ఎదురుగా ఉన్న కోనేరు రివిట్‌మెంట్‌కు రూ.15 లక్షలు కేటాయించారు. దీని పనులు ప్రారంభం కాలేదు. మిషన్ భగీరథ, డ్రిస్ట్రిబ్యూషన్ ప్లాంట్ ఉండ్రుగొండ గుట్టలో ఏర్పాటు చేసి ఫిల్టర్ వేస్ట్ వాటర్‌ను గిరిదుర్గంలోకి వదిలి పచ్చదనాన్ని సంవత్సరమంతా కాపాడాలని ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. అలాగే రోప్‌వే, ఎకో-టూరిజం టెంట్స్, ఫారెస్ట్ హట్స్, ఫారెస్టు గెస్ట్‌హౌజ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన కార్యరూపం దాల్చలేదు.

రూ. 30కోట్లతో కార్యాచరణ



జిల్లాకు రూ.30కోట్లతో పర్యాటక కేంద్ర అభివృద్ధికి కార్యచరణ రూపొందిస్తున్నాం. ముఖ్యంగా ఉండ్రుగొండ, పిల్లలమర్రి దేవాలయం, ఫణిగిరి అభివృద్ధి చేస్తాం. అదేవిధంగా కోదాడ పట్టణంలోని పెద్దచెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులతో కూడిన బృందం అధ్యయనం చేసింది. జిల్లాను పర్యాటక కేంద్రంగా రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

● పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్.

ప్రతిపాదనలేనా.. రాచ'కొండ'గా మారేనా?

చౌటుప్పల్: రాచకొండ ప్రాంతం సాయుధ పోరాటానికి నిలయం. తర్వాత పీపుల్స్‌వార్ ఉద్యమానికి నిలయంగా ఉండేది. నేటి తెలంగాణకు ఒకనాడు రాజధానిగా విలసిల్లింది. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న రాచకొండ గుట్టలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రయత్నించారు. ఇక్కడ అవసరమైన ప్రభుత్వ భూమి ఉండడం.. దానికి తోడు హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఉండడంతో ఈ ప్రాంతంలో వివిధ రకాల ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. ఈ ప్రాంతంలో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాచకొండ గుట్టల్లో ఫిలిం సిటీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్‌సిటీ, ఎడ్యుకేషన్ హబ్, స్మార్ట్‌సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ లాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయి. దశాబ్ద కాలం గడిచిన నేటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా రాచకొండలో ఫిలిం సిటీ ఏర్పాటుతోపాటు పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.

రాచకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

రాచకొండ ప్రాంతం పర్యాటకానికి పెట్టింది పేరు. ఇక్కడ కొండలు గుట్టలు సెలయేర్లు పర్యాటకాన్ని తలపిస్తాయి. రేచర్ల పద్మనాయకుల కాలంలో ఇక్కడ నిర్మించిన రాచరిక కట్టడాలు నేటికీ గత వైభవాన్ని చాటి చెబుతాయి. ఇక్కడి దేవాలయాలను నిత్యం



ఎంతోమంది ప్రజలు సందర్శిస్తున్నారు. రాచకొండ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి ఈప్రాంత్రాన్ని సందర్శించే పర్యాటకుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలి.

● సూరపల్లి వెంకటేష్ ,రాచప్ప సమితి ప్రధాన కార్యదర్శి

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

త్రిపురారం, సెప్టెంబరు 26: భూ తగాదాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని అల్వాలపాడులో గురువారం జరిగింది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధనావత్ వెంకటేశ్వర్లు(32) తమ బంధువులతో 15సంవత్సరాలుగా భూ పంపిణీలో పంచాయితీ నడుస్తోంది. వారి వేధింపులతో మనస్తాపా నికి గురైన వెంకటేశ్వర్లు ఈ నెల 24వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన భార్య అతనిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ అదే రోజు మృతిచెందాడు. బంధువులతో చర్చల నిమిత్తం మృతదేహాన్ని రెండు రోజులు మార్చురీలో భద్రపరిచారు. వారి మధ్య రాజీ కుదరకపోవడంతో వెంకటేశ్వర్లు భార్య జ్యోతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కు చెల్లించి వస్తూ..



శైలజ మృతదేహం

మాడ్గులపల్లి, సెప్టెంబరు 26: ట్రాక్టర్ ఇంజన్‌పై నుంచి జారిపడి మహిళ మృతిచెందింది. మరో మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామ శివారులో పాలేరు వాగు వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన 20 మంది కూలీలు రెండు ట్రాక్టర్లలో మండలంలోని సుందర్‌నగర్ వద్ద ఉన్న బంగారు మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. మొక్కులు చెల్లించుకొని తిరిగి వస్తుండగా మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం పాలేరు వాగు వద్దకు రాగానే రోడ్డుకు అడ్డంగా స్పీడ్ బ్రేకర్ ఉండడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌పై ఇంజన్ పై ఉన్న దొంతగాని శైలజ(32), శేషగాని నాగమ్మ కింద పడిపోయారు. తలకు బలమైన గాయాలు కావడంతో శైలజ అక్కడికక్కడే మృతిచెందింది. నాగమ్మకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో నాగమ్మకు మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శైలజకు పాప, బాబు ఉన్నారు.

బైక్‌పై ఇంటికి వెళ్తుండగా..

కొండమల్లేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొవడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో బుధవారం అర్థరాత్రి జరిగింది. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బోడ బలరాం కొండమల్లేపల్లి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పని ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బలరాం కాలికి గాయమైంది. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అమ్మ కావాలి.. అమ్మ రావాలి

● తల్లి కోసం తల్లడిల్లిన చిన్నారులు ● కాల్వలో గల్లంతైన శైలజ మృతదేహం లభ్యం ● త్రిపురారంలో విషాదఛాయలు




శైలజ మృతదేహం, తల్లికోసం రోదిస్తున్న చిన్నారులు

నిడమనూరు, సెప్టెంబరు 26: స్నానం చేయించి.. అన్నం తినిపించి.. బుజ్జగించే తల్లి కోసం ఆ ముగ్గురు చిన్నారులు గుక్క పెట్టి ఏడుస్తున్నారు. అమ్మ కావాలి.. అమ్మ రావాలి అని గుండెలవిసేలా రోదించారు. ఆ పిల్లలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. అమ్మ ఎప్పుడొస్తుందంటూ నాన్నమ్మను అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం ఆ వృద్ధురాలు నుంచి మౌనమే సమాధానమైంది. పిల్లలను పట్టుకొని ఆమె కూడా కన్నీరుమున్నీరైంది. కన్న తల్లి కోసం ఆ పిల్లలు రోదిస్తున్న తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన మేదరి శైలజ దుస్తులు ఉతికేందుకు మరో ఇద్దరితో కలిసి బుధవారం సాగర్ కాల్వకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైంది. ఆమె మృతదేహం గురువారం సాయంత్రం త్రిపురారం మండల పరిధిలోని కంపాసాగర్ బ్రిడ్జి సమీపంలో లభ్యమైంది. త్రిపురారంలోని ఇందిరమ్మ కాలనీలో జీవనం సాగించే శైలజ, జానయ్య దంపతులకు అవంతిక(12), అంజలి(10), జ్యోత్స్నప్రియ(8) వయసున్న ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు నల్లగొండలోని ఎస్సీ గురుకులంలో ఏడో తరగతి చదువుతుండగా, మిగితా ఇద్దరు త్రిపురారంలో చదువుతున్నారు. భర్త సుతారి పని చేస్తున్నాడు. భర్తకొచ్చే ఆదాయంతో ముగ్గురు పిల్లలను సాకడం కష్టం కావడంతో ఆమె కూడా భర్తకు చేదోడుగా ఉండాలనే తపనతో స్థానికంగా ఓ కూరగాయల దుకాణంలో పని చేస్తుండేది శైలజ. కానీ దుకాణం యజమానికి చెందిన దుస్తులు ఉతికేందుకు బొక్కమంతలపహడ్ వద్ద ఉన్న సాగర్ కాల్వకు వెళ్లి దుస్తులు ఉతికి పైకి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆమె ముగ్గురు కుమార్తెలు తల్లి లేని వారయ్యారు.

కంపాసాగర్ వద్ద శైలజ మృతదేహం లభ్యం

కాల్వలో ముగ్గురు గల్లంతు కాగా స్థానికులు ఓ మహిళను రక్షించగా శైలజతో పాటు సాయి నీటిలో కొట్టుకుపోయారు. పోలీసులు గజ ఈతగాళ్లతో కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు కంపాసాగర్ బ్రిడ్జి వద్ద శైలజ మృతదేహం లభ్యమైంది. సాయి కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా శైలజ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు విలపిస్తున్నారు.

నకిలీ బంగారం అంటగట్టి బురిడీ

● రూ.7లక్షల నగదు, మూడు నకిలీ బంగారు బిస్కెట్లు స్వాధీనం ● ముఠా సభ్యులను అరెస్టు చేసిన హుజూర్‌నగర్ పోలీసులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 26: నకిలీ బంగారం అంటగట్టి ప్రజలను మోసం చేసేందుకు యత్నించిన ముఠాను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మోదుగుంట్ల గ్రామానికి చెందిన నోముల ప్రకాశ్ అలియాస్ వెంకట్, నోముల మత్స్యగిరి అన్నదమ్ముళ్లు. ఆత్మకూర్(ఎం) మండలంలో ఓంసాయి ట్రేడర్స్ పేరుతో టైల్స్ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో తీవ్ర నష్టం వాటిల్లడంతో ఎలాగైనా సులువుగా డబ్బు సంపాదించాలని పల్నాడు జిల్లా రాజుపాలెంకు చెందిన కోమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డికి తెలిసిన వ్యక్తిద్వారా కలిసి రత్తయ్య, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మానసపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన డేరింగుల కృష్ణవేణి, భువనగిరి-యాదాద్రి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలంలోని మోదుగుండ్లకు చెందిన నోముల ప్రకాశ్ అలియాస్ వెంకటేశ్వరరావు, నోముల వెంకట్, నోముల మత్యగిరి ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను ఎంచుకుని వారికి నకిలీ బంగారాన్ని నిజమైన బంగారంగా నమ్మించి వారికి అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో కోమెర రత్తయ్య, రేణుక పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కంసలి వారి దగ్గర నకిలీ బంగారం బిస్కెట్లను తయారు చేయించారు. ప్రకాశ్, ఈ నెల 2వ తేదీన మునగాల మండలం నారాయణగూడేనికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డితో తమ బంధువులు కొత్త ఇల్లు కట్టాలనే ఉద్దేశంతో పాత ఇల్లు కూలుస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని చెప్పారు. తక్కువ ధరకు ఇప్పిస్తానని చెప్పి వ్యాపారి వెంకటరెడ్డిని మఠంపల్లి మండలం సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లి కోమెర రత్తయ్య నుంచి నకిలీ బంగారు బిస్కెట్లు ఇస్తామని ప్రకాశ్ చిన్నపిల్లలు ఆడుకునే కాగితపు కరెన్సీ తీసుకెళ్లి, వెంకటరెడ్డి నుంచి రూ.7లక్షలు తీసుకొని అతనికి బంగారం ఇవ్వకుండా పారిపోయారు. దీనిపై ఈ నెల 3న రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటరెడ్డి మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరికొందరిని మోసం చేసేందుకు యత్నిస్తుండగా..

ముఠా సభ్యులు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెంకు చెందిన మాతంగి శ్రీను అతనికి బంగారం ఆశ చూపి హుజూర్‌నగర్‌కు రమ్మని చెప్పి శ్రీను నుంచి రూ.10వేలు తీసుకున్నారు. ఎంతకు శ్రీనుకు బంగారం ఇవ్వకపోవడంతో ఈ నెల 24న మాతంగి శ్రీను పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ రెండు విషయాలపై హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు విచారణ చేసి ఈనెల 26న నేరస్తులు జెర్రిపోతులగూడెంకు చెందిన మాతంగి శ్రీనుకు మట్టపల్లి రోడ్డులో గల భారత్ పెట్రోల్ బంక్ వద్ద డబ్బులు తీసుకుని వస్తే బంగారం ఇస్తామని చెప్పగా వారి సూచనల మేరకు గురువారం ఉదయం 11గంటలకు నోముల ప్రకాశ్, నోముల మత్స్యగిరి, మాతంగి శ్రీనులు నకిలీ బంగారంతో రాగా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. నిందితుల సమాచారంతో కోదాడ ఆర్కే లాడ్జిలో ఉన్న దేవరంగుల కృష్ణవేణి, బత్తులరేణుకలను పట్టుకున్నారు. వారి నుంచి రూ.7లక్షల నగదు, రెండు బైక్‌లు, ఆటో, 9సెల్‌ఫోన్లు, 3నకిలీ బంగారు బిస్కెట్లు, చిన్నపిల్లలు ఆడుకునే రూ.500ల 761నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తికోసం పోరాటం చేసిన ధీర వనిత చాకలి ఐలమ్మ, ఆమె 129వ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఆమె చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)



భువనగిరిలో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ అంజిరెడ్డి



ఆలేరు మునిసిపల్ కేంద్రంలో ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

వీరనారి.. ఐలమ్మ

● జిల్లావ్యాప్తంగా ఐలమ్మ జయంతి వేడుకలు



ఆత్మకూరు (ఎం) ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ రాజు



భువనగిరి మునిసిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు



సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ జగన్, వివిధ సంఘాల నాయకులు



భూదాన్‌పోచంపల్లిలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, రజక సంఘం నాయకులు

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



బాధితుడికి ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 26 : నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. భువ నగిరి మం డలం వడపర్తికి చెందిన కాసాని వెంకటేశ్ కొంత కాలంగా కిడ్నీ సమ స్య తో బాధపడుతుండడంతో కిడ్నీ ఆపరేషన్‌కు మంజూరైన రూ. 2. 50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని గురువారం ఆయన అందజేశారు. గతంలో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.5 లక్ష లు అందజేసినప్పటికీ అదనంగా రూ.2.50 లక్షలు బాధిత కుటుంబానికి అందజే సిన ట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి తెలిపారు. మునిసిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, కనుకుంట్ల బాబురావు, సత్తయ్య తదితరులున్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి



పోస్ట్ కార్డులు ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26 : న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలంటే పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టినట్లు భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఐలూ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి తెలి పారు. గురువారం భువనగిరిలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో వారు మాట్లా డారు. 2019 తర్వాత బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి న్యాయవాదులందరూ ఉత్తరాలు రాయాలన్నారు. ఈ మేరకు రాసిన ఉత్తరాలను ప్రదర్శించి సీఎంకు పోస్ట్ చేశారు. న్యాయవాదులు కలకుంట్ల జయ, మట్ట వెంకటేశ్వర్లు, ఎండీ మిహల్, పిడుగు ఐలయ్య, ఆకుల మల్లేష్, నరేష్, విద్యాసాగర్, రాజశేఖర్, జంగయ్య పాల్గొన్నారు.

రెండు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26: భువనగిరి పట్టణంలో 2 లక్షల ఔషధ, పండ్ల, పూల మొక్కలు నాటి సంరక్షించడం లక్ష్యమని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంక టేశ్వర్లు అన్నారు. గురువారం 9, 22, 23, 31 వార్డుల్లో ఆయన మొక్కలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో కమిషనర్ పి రామాంజలరెడ్డి, కౌన్సిలర్లు నల్లమాస సుమ, బొర్ర రాకే ష్, రేణుక, వెంకట నర్సింగ్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం రావుల సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీకి మైక్, వీధి లైట్ల అందజేత



వీధిలైట్లు, మైక్‌సెట్‌ను కార్యదర్శి శిరీషకు అందజేస్తున్న అజ్మీరా కిషన్‌నాయక్

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 26: యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్ తండాకు బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అజ్మీరా కిషన్‌నాయక్ రూ. 55 వేల విలువైన వీధిలైట్లు, మైక్‌సెట్ గురువారం పంచాయతీ కార్యదర్శి శిరీషకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు సహకార ఉంటుందన్నారు. మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షాలతో పంటలకు మేలు

● జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

భువనగిరి రూరల్, సెప్టెంబరు 26: కురుస్తున్న వర్షాలతో పత్తి, వరి పంటలకు మేలు చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్ అన్నారు. వ్యవసాయ పరిశోధన, కంపాసాగర్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం భువనగిరి మండలంలోని జమ్మాపూర్, కూనూరు, చీమలకొండూరు, వీరవెల్లి, బండసోమారం గ్రామాల్లోని వరి, పత్తి, కొర్ర, కంది, పెసర, మినుములు, ఉలువల తదితర పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా, పొటాష్ ఎరువుల వినియోగం, పత్తిలో రసం పీల్చు పురుగులు, పోషకలోపాలు సవరించుకునే తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు మమత, డాక్టర్ లింగయ్య, కె.చంద్రశేఖర్, రాములమ్మ, ఆదర్శ రైతులు కంచి మల్లయ్య, సిద్దారెడ్డి, రాములు, బాలరాజు, అనిల్, లావణ్య, సంధ్య పాల్గొన్నారు.

పోచంపల్లి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలి



సిబ్బందికి చేనేత ఇక్కత్ వస్త్రాలు అందిస్తున్న బ్యాంకు చైర్మన్ తడక రమేష్

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 26 : పోచంపల్లి అర్బన్ బ్యాంక్ పురోభివృద్ధి సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అన్నారు. గురువారం ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శాఖ బ్యాంక్‌లోని 30 మంది సిబ్బందికి యూనిఫామ్‌గా చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, బ్యాంకు డైరెక్టర్లు ఏలె హరిశంకర్, సూరపల్లి రమేష్, రాపోలు వేణు, కొండమడుగు ఎల్లస్వామి, మహిళా డైరెక్టర్లు గుండు కావ్య, కర్నాటి భార్గవి, బ్యాంకు సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్, బ్రాంచ్ మేనేజర్ రచ్చ శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పాత వస్తువుల పునర్ వినియోగంపై అవగాహన

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26 : పాత వస్తువుల పునర్‌వినియోగంతో పర్యావరణ పరిరక్షణగా ఉంటుందనిశానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, హెల్త్ అసిస్టెంట్ రజిత అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం భువనగిరిలోని బాగాయత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పాత వస్తువుల పునర్ వినియోగంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం : డీసీపీ



డీసీపీ రాజేష్ చంద్రను అభినందిస్తున్న ప్రతిభ, ప్రతాప్ తదితరులు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 26 : ఆధ్యాత్మిక కేంద్రం సురేంద్రపురిలో సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని రాచకొండ పోలీస్ కమిషనరేట్ భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. గురు వారం కుందా సురేంద్ర వర్ధంతి సందర్భంగా సురేంద్రపురిలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అనంతరం డీసీపీని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేంద్రపురి ఎండీ కుందా ప్రతిభ, కుందా ప్రతాప్, మేనేజర్ తమ్మి రమేశ్, నర్సింహారావు తదితరులున్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

● మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 26 : గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత గ్రా మ మంచినీటి సహాయకులదేనని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ శిబిరం గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ తాగునీరు అంది ంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహించే శిక్షణలో అందరూ పాల్గొనాలన్నారు. నాల ుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో వారు అన్ని అంశాలను సమగ్రంగా నేర్చుకుని గ్రామంలో మంచినీటి సరఫరా సమర్థవంతంగా జరిగేట్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణయ్య, భువనగిరి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరుణాకర్, గ్రిడ్ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ దీన్ దయాళ్, సాయినాథ్‌రెడ్డి, శ్వేత, మిషన్ భగీరథ హెల్పర్స్ మంగాటి నరసింహ, మంచాల నర్సింహ, ఎస్‌కే షరీఫ్, రాములు, గ్రామ మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న సీఈ లలిత

చేనేత కార్మికులందరికీ సభ్యత్వం ఇవ్వాలి



చేనేత సంఘం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26 : భువనగిరి చేనేత సహకార సంఘంలో భువనగిరికి చెందిన చేనేత కార్మికులందరికీ సభ్యత్వం ఇవ్వాలంటూ చేనేత కార్మికులు గురువారం సహకార భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్థానికులందరికీ సభ్యత్వం ఇవ్వాలని సూచించినప్పటికీ పాలక మండలి నుంచి స్పందన కరువైందని అన్నారు. అందరికీ సభ్యత్వాలు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి భిక్షపతి, పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు బింగి భిక్షపతి, అమృతం ఆంజనేయులు, బురుగు శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు పోరాటం : సీపీఎం

వలిగొండ, సెప్టెంబరు 26: రీజనల్ రింగ్ రోడ్(ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్ మార్పుకోసం రాజకీయాలకతీతంగా రైతులందరూ ఐక్యం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వర్కట్ పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బంది కలిగించే ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మారుస్తాని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక మాట మార్చారని ఆరోపించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అలైన్‌మెంట్ మార్పుకోసం రైతులతో కలిసి కేంద్రం మొండి వైఖరికి నిరసనగా ఉద్యమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు బుచ్చిరెడ్డి, ముత్యాలు, తుర్కపల్లి సురేందర్, రవీందర్‌రెడ్డి, నర్సింహ, వెంకటేశం పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన రైతులు

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని వలిగొండ మండల రైతులు నెలరోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. వలిగొండ మండలంలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి 488 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా, సుమారు 142 ఎకరాలు మాత్రమే సేకరించి కొలతలుగా వేశారు. మొత్తం 1776 మంది రైతుల నుంచి భూములు సేకరించాల్సి ఉంది. రైతుల సహకారం లేకపోడంతో మిగతా భూమికి కొలతలు వేయలేదు. మొదటి అలైన్‌మెంట్‌లో ప్రభుత్వ భూమి ఉందని, దాని ప్రకారమే భూ సేకరణ చేయాలని వలిగొండ మండలం గోకారం, వర్కట్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేడో.. రేపో స్టే వచ్చే అవకాశాలున్నాయని రైతులు నాగెల్లి దశరథ, జనార్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటేశం, యాదగిరితోపాటు మరికొంత మంది రైతులు తెలిపారు.



● **చౌటుప్పల్ టౌన్ :** తిరుమలలో పవిత్రమైన వేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూను అపవిత్రం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు మన్నె ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వీహెచ్ పీ నాయకులు గరిసె శేఖర్, విష్ణుకాంత్, వినయ్, నరేష్‌పాల్గొన్నారు.

● **భువనగిరి టౌన్ :** పోచంపల్లి మండలం భీమనపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ గురువారం బీఎస్పీ ఆధ్వ ర్యంలో భువనగిరిలో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాసాని మహేం దర్, జిల్లా ఇన్‌చార్జీ గంధమల్ల లింగస్వామి పాల్గొన్నారు.

● **ఆలేరు రూరల్ :** గంధమల్ల చెరువు ద్వారా ఆలేరు పెద్ద వాగుకు నీరు రావడం అభినందనీయమని కొలనుపాక తాజా మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. భైరాంనగర్‌లో ప్రవహిస్తున్న వాగులో గురువారం రైతులతో కలిసి పూజలు చేశారు. చాడ సురేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, అంజయ్య ఉన్నారు.

● **ఆలేరు రూరల్ :** సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని ఆలేరు ఏడీఏ పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని మంతపురి, బహద్దూర్‌పేట గ్రామాల్లోని పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు శాలిని, శివకుమార్ తదితరులు ఉన్నారు.



● **ఆలేరు రూరల్ :** కేంద్రం అమల్లోకి తీసుకురానున్న జమిలి ఎన్నికలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఆలేరులో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తుందన్నారు.

● **ఆలేరు రూరల్** కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన 4 కార్మిక, వ్యతిరేక చట్టాలను, 3 నేర చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్దన్ డిమాండ్ చేశారు. గురువారం ఆలేరులో సెప్టెంబరు 30న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు .కార్యక్రమంలో నాయకులు ఎగ్గిడి ఉప్పలయ్య, చిన్ని వెంకటేష్, బీరప్ప, మధు, నర్సింహులు, శ్రీకాంత్, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు (ఎం) :**మండల కేంద్రానికి చెందిన బూడిద రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాలనీవాసులు రూ. 47 వేలు సేకరించి రవి కుటుంబానికి గురువారం అందజేశారు.

● **ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 26 :** రైతు పండించే అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాఘవా పురంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ప్రకటించడంతో మూసీ పరీవాహక ప్రాంతాల్లో కేవలం దొడ్డురకం వరి మాత్రమే పండుతుందని అలాంటి రైతులకు బోనస్ ఇవ్వకపోతే నష్ట పోతారన్నారు. అనంతరం రాఘవాపురం సీపీఎం గ్రామ శాఖ కార్య దర్శిగా రేసు యాదిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సయ్య, ఐల య్య, భారతమ్మ, నశీద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **ఆత్మకూరు (ఎం) :** మండ లకేం ద్రంలో గురువారం నిర్వహించిన పీఆర్టీయూ మండల కమిటీ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మజ్జిగ లక్ష్మణ్, ప్రధానకార్యదర్శిగా జెట్ట రవీందర్, కార్యదర్శిగా జి.సైదులు, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.వెంకన్న, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఏ.రామాంజమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు కరు ణాకర్‌రెడ్డి, టి.గోపాల్‌రెడ్డి, కే.మహదేవరెడ్డి, పద్మారెడ్డి, జి.మధు, ఉమా శేఖర్, నరేందర్, పాల్గొన్నారు.

లక్ష్మణ్, రవీందర్

● **ఆలేరు రూరల్ :** తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి ఎడడంతో గీతకార్మికుడికి తీవ్రగా యాలయ్యాయి. మండలంలోని కొలను పాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు మాటూరి నాగరాజుగౌడ్ ఉదయం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో జారి పడడంతో తీవ్రగాయా లయ్యాయి. ప్రాథమిక చికిత్స కోసం ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.

● **మోత్కూరు:** విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ రాజీలేని పోరాటం చేస్తున్నదని ఆ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ సుర్వి మణికంఠ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా నూనెముంతల సాయిహర్షిత్, సంయుక్త కార్యదర్శులుగా వినాయక్, సంజయ్, ఉపాధ్యక్షుడిగా కదారి శివశంకర్, అంచిత, కార్యవర్గ సభ్యులుగా సాయిగణేష్, వరుణ్, శ్రవణ్‌ను ఎన్నుకున్నారు.

● **భువనగిరి రూరల్ :** స్వచ్ఛతా హీ సేవా కార్యక్ర మంలో భాగంగా గురువారం మండలంలోని బొల్లేపల్లిలో మండలంలోనిపారిశుధ్య కార్మి కులకు వైద్యాధికారి డాక్టర్ యామిని శృతి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సాయి శోభ, ఎంపీవో దినకర్, వైద్యులు ఆశలు పాల్గొన్నారు.

●**భువనగిరి రూరల్ :** నల్లగొండ జిల్లా గుర్రంపోడు ఎంపీడీవో మంజుల, పెద్దవూర, దామరచర్ల మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, స్వప్నను కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని నిర సిస్తూ ఎంపీడీవో శ్రీనివాస్‌తో సహా పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు వెంటనే సస్పెండ్‌ను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనం తరం ఎంపీడీవో శ్రీనివాస్‌కు కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు.

● **వలిగొండ :** విద్యాభివృద్ధికి దివీస్ సంస్థ సేవలు అభినందనీయమని పంచాయతీ కార్యదర్శి అండాలు, హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని గొల్నెపల్లి ప్రభుత్వ పాఠశాలకు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సౌజన్యంతో రూ.19,67,540 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పావని, తాజా మాజీ సర్పంచ్ శివశాంత్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● **వలిగొండ :** ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టును వెంటనే భర్తీ చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వర్కట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆ పార్టీ బృందం సభ్యులు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో రవికుమార్, నాయకులు ప్రవీణ్, వెంకటేష్, నవీన్, అరుణ్ పాల్గొన్నారు.

●**వలిగొండ :** సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సురేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో హమాలీ కార్మికుల సమా వేశంలో ఆయన మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ ఎంఈవోగా ఎలికట్టె గురువారావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, గంజి మారయ్య, శ్రీను, కె.మాధవరెడ్డి, భాస్కర్, మేడి యాదయ్య, జ్యోతి పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరు ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన తీపిరెడ్డి గోపాల్‌రెడ్డిని గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు.